



మామ,
ఎలుగుబంటీ

చిత్రాలు ఇ.రచ్యేవ్




మామ, ఎలుగుబంటీ



అనువాదం: అట్టేరి కుప్పరాజులు

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో





అనగా అనగా ఒక చిన్న పల్లె. ఆ పల్లెలో ఒక ముసలి దంపతులు. వారికో ముద్దుల మనుమరాలు — మాష. ఒక రోజున స్నేహితురాళ్ళందరు కలుసుకుని పుట్టకొక్కులూ అడవిపళ్ళూ ఏరుకుందామని కూడబలుక్కున్నారు. మాషను కూడ రమ్మని పిలిచారు.

''అవ్వా తాతా! వీళ్ళతో కలిసి అడవికి వెళ్ళాలని వుంది నాకు,'' అని అడిగింది మాష.

''అలాగే వెళ్ళు. కాని స్నేహితురాళ్ళని మాత్రం వదలకేం! దారి తప్పిపోతావు సుమా!'' అన్నారు తాత, అవ్వ.

పిల్లలందరు అడవి చేరారు. పుట్టకొక్కులూ అడవిపళ్ళూ ఏరుకోవటం మొదలుపెట్టారు. మాష అడుగులో అడుగు వేసుకుంటూ, చెట్లూ, తుప్పలూ దాటుకుంటూ, పుట్టకొక్కులూ అడవిపళ్ళూ ఏరుకుంటూ దూరం, చాల దూరం వెళ్ళిపోయింది.

ఉన్నట్టుండి ఆగింది మాష. ఎవరూ కనుపించలేదు. గట్టిగా పిలిచింది. ఎవరూ పలుకలేదు.

అడవిలో ఇటు వెళ్ళింది, అటు వెళ్ళింది — ఇంకేముంది, మాష దారితప్పిపోయింది.

తిరిగి తిరిగి నట్టడవి చేరింది పాపం మాష. అల్లంతలో చిన్న గుడిసె కనబడింది. దగ్గరికెళ్ళి తలుపు తట్టింది. జబాబు లేదు. తలుపు నెట్టింది. నెట్టగానే తెరుచుకుంది తలుపు.

లోపలికెళ్ళింది మాష. కిటికీ దగ్గర కూచుని ఆలోచించింది: ''ఈ ఇంట్లో ఎవరున్నారు చెప్మా? ఎవరూ కనుపించరేం?...''

అసలు సంగతేమిటంటే ఆ ఇంట్లో ఒక పెద్ద ఎలుగుబంటి నివసిస్తోంది. అప్పుడది ఇంట్లో లేదు. అడవిలో ఎక్కడో తిరుగుతోంది.

సాయంత్రానికి ఎలుగుబంటి ఇల్లు చేరుకుంది. మాషను చూసి, సంతోషంతో ఎగిరి గంతేసింది.

''అహ్హా! నిన్నింక వదల్ను. నువ్వు నాతో వుండిపోవాలి. ఇంటికి తిరిగి వచ్చేలోగా పొయ్యి రాజేసి, భోజనం వండి నాకు పెట్టాలి, అర్థమయిందా!'' అని పెద్దగా అరచింది ఎలుగుబంటి.



పాపం! మాష కొంతసేపు విచారించింది. ఏడ్చింది, గత్యంతరం లేదాయె! ఆ గుడిసెలోనే ఎలుగుబంటితో వుండిపోయింది.

ఎలుగుబంటి ప్రతిరోజూ ప్రొద్దున్న ఎక్కడికో వెళ్ళిపోతుంది. దీపాలు పెట్టే వేళకు గాని తిరిగిరాదు. తను ఇంట్లో లేనప్పుడు ఎక్కడికీ వెళ్ళకూడదని మాషను శాసించింది.

''నా మాట తప్పావా — నిన్నెల్లాగైనా పట్టుకుంటాను. ఇకప్పుడు నిన్ను తినేస్తాను!'' అని బెదరించింది ఎలుగుబంటి.

రోజంతా మాష ఆలోచించింది, ఎలా పారిపోవడమా అని. చుట్టూ దట్టమైన అడవాయె. ఎటు వెళ్ళటం? అడగటానికి కూడ ఎవరూ లేరాయె....

ఆలోచించింది, ఆలోచించింది, చివరకు చక్కటి ఉపాయం ఆలోచించింది.

ఒకనాడు సాయంత్రం ఎలుగుబంటి వచ్చిందింటికి. అప్పుడండి మాష ఎలుగుబంటితో:

''ఎలుగుబంటీ! ఎలుగుబంటీ! ఒక్కరోజుకి నన్ను మా పల్లెకి వెళ్ళనియ్యి. మా తాతకీ అవ్వకీ మిఠాయీలు ఇచ్చివస్తాను.''

''వీల్లేదు! నువ్వు అడవిలో దారి కనుక్కోలేవు. ఇటివ్వు. నేనే ఇచ్చివస్తాను,'' అంది ఎలుగుబంటి.

ఇంకేం కావాలి మాషకు!

మాష మిఠాయీలన్నిటిని పేర్చింది. అటకమీది పెద్ద పెట్టెను ఎలుగుబంటిచేత కిందుకు తీయించింది.

''ఇల్లా చూడు! మిఠాయీలు ఈ పెట్టెలో పేరుస్తాను. దీన్ని జాగ్రత్తగా మా తాతకీ అవ్వకీ ఇచ్చిరావాలి. ఒక్కటి మాత్రం బాగా గుర్తుంచుకో: దారిలో ఎక్కడా పెట్టె తెరవకు. మిఠాయీలు కాజేయకు. నేను ఓక్ చెట్టు చిటారుకొమ్మన కూచుని నిన్నే చూస్తూ ఉంటాను సుమా!'' అని ఎలుగుబంటితో అంది మాష.



''సరేలే! ఆ పెట్టె ఇలా ఇవ్వు,'' అంది ఎలుగుబంటి.

''వీధివసారాలోకెళ్ళి చూడు వాన కురుస్తోందేమో,'' అంది మాష.

ఎలుగుబంటి గుమ్మం దాటగానే చటుక్కున పెట్టెలో కూచుని, తన తలమీద మిఠాయిల తట్టను పెట్టుకుని మూత వేసేసుకుంది మాష.

లోపలికొచ్చింది ఎలుగుబంటి. పెట్టె తయారుగా ఉంది. ఇకనేం, పెట్టె వీపునెక్కించుకొని బయలు దేరింది పల్లెకు.

రొజుకుంటూ చెట్ల మధ్య నడచింది, రొప్పుకుంటూ మలుపులు తిరిగింది, వాగులు దాటింది, గుట్ట లెక్కింది. వెళ్ళివెళ్ళి బాగా అలిసిపోయింది ఎలుగుబంటి. తనలో ఇలా అనుకుంది:

చెట్టునీడను కూర్చుంటా,
పొట్టనిండా మిఠాయిలు తింటా!

ఇది వినబడింది మాషకు. పెట్టెలోనుంచి అరిచింది.

చూస్తున్నా! చూస్తున్నా!
నీ పోకడ గమనిస్తున్నా!
చెట్టునీడను కూచోకు,
మిఠాయిలు తినకు!
తీసుకెళ్ళు తాతకు,
తీసుకెళ్ళు అవ్వకు.

''అబ్బో! ఈ అమ్మాయి కెలాంటి కళ్ళు! అంతా చూస్తోంది,'' అని నిట్టూర్చింది ఎలుగుబంటి.



మళ్ళా పెట్టె వీపు నెక్కించింది. పల్లెవైపు నడక సాగించింది. చాలదూరం వెళ్ళింది. వెళ్ళి తర్వాత ఆగి, కూచుని ఇలా అనుకుంది.

చెట్టునీడను కూర్చుంటా,
పొట్టనిండా మిఠాయీలు తింటా!

ఇది వినబడింది మాషకు. పెట్టెలోనుంచి మళ్ళా అరిచింది.

చూస్తున్నా! చూస్తున్నా!
నీ పోకడ గమనిస్తున్నా!
చెట్టునీడను కూచోకు,
మిఠాయీలు తినకు!
తీసుకెళ్ళు తాతకు,
తీసుకెళ్ళు అవ్వకు.

ఆశ్చర్యపోయింది ఎలుగుబంటి.

''ఎంత టక్కరిదబ్బా ఈ అమ్మాయి. చెట్టు చివరన కూర్చుంది. అడవి అంచుదాక చూస్తోంది,'' అనుకుని నిట్టూర్చుతూ లేచి మళ్ళీ గబాగబా నడచింది, ఎలుగుబంటి.

చివరకు చేరుకుంది పల్లె. కనుక్కుంది తాత, అవ్వల ఇల్లు. తలుపుమీద గట్టిగా బాదింది.

''దబ్-దబ్-దబ్! ఎవరీ ఇంట్లో! గడియ తీయండి. తలుపు తెరవండి. మాష దగ్గరనుంచి మీకని మిఠాయీలు తీసుకొచ్చాను,'' అని అరిచింది ఎలుగుబంటి.

పసిగట్టాయి కుక్కలు. అన్ని వైపులనుంచీ మొరుగుతూ ఎలుగుబంటిమీద పడ్డాయి.

ఎలుగుబంటి భయపడిపోయి, పెట్టె గుమ్మంలో ఉంచేసి మరి వెనక్కి తిరిగిచూడకుండా పరుగెత్తింది అడవిలోకి.




సరిగ్గా అప్పుడే తలుపుతీసి, గుమ్మంలోకొచ్చారు అవ్వ, తాత. ఏమిటీ సందడని చుట్టూ చూశారు. పెట్టె కంటబడింది.

''ఏమిటబ్బా ఈ పెట్టె,'' అని ఆశ్చర్యపోయింది అవ్వ.

తాత పెట్టె మూత తెరిచాడు. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. పెట్టెలో వుంది మాష! —

తాత, అవ్వలు ఎంతో సంతోషించారు. మాషను కౌగలించుకొన్నారు. ముద్దుల వర్షం కురిపించారు. ఎంత తెలివైన దానవే అని మెచ్చుకున్నారు.





МАША И МЕДВЕДЬ

Русская народная сказка

На языке телугу